

# అమ్మకడుపు చల్లగా...

## – గొల్లపూడి మారుతీరావు



### (గత సంచిక తరువాయి)

**నా గవర్నమెంటు ఉద్యోగానికి** వివిధమయిన దశల గురించి చెపితే గవర్నమెంటు ఉద్యోగాల చరిత్ర సోదాహరణంగా అర్థమవుతుంది. నా పెళ్ళికాకముందు రేడియో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాను. పెళ్ళి అయి, మా ఆవిడ కాపురానికి వచ్చాక ఆవిడని పుట్టింటికి పంపి రేడియో పరీక్ష రాయడానికి మద్రాసు వెళ్ళాను. ఆమెని పురిటికి పంపాక రేడియో ఇంటర్వ్యూకి హాజరయాను. మా పెద్దబ్బాయి పుట్టాక, ఆరోనెలని అతనికి బారసాల చేసి హైదరాబాదులో ఉద్యోగంలో చేరాను. నా జీవితంలో పరిణామాలు తొందరగా జరిగాయో, ప్రభుత్వంలో పనులు ఆలస్యంగా జరుగుతాయో వివరించడం కష్టం.

రేడియో పరీక్షకి చిన్న అనుభవం. ఆ రోజు మద్రాసులో కుండపోతగా వర్షం. మిత్రులు పూసపాటి కృష్ణంరాజుగారి గదిలో మకాం. (కృష్ణంరాజుగారు విజయనగరం నాటక పోటీలలో పరిచయం. మంచి కథా రచయిత. సినిమాలలో అసిస్టెంటు డైరెక్టరుగా పనిచేస్తున్నారు అప్పటికి.) వ్యాసారావు వీథిలో మేడ మీద ఉండేవారు. ఒక లుంగీ, షర్టు, పెద్ద టర్కీ తువాలుతో శాంథోమ్ చర్చి ఎదురుగా ఉన్న హాలుకి పరీక్ష రాయడానికి వచ్చాను. తువాలు పిండుకుని, పక్కన పెట్టుకుని పరీక్ష రాశాను. పరీక్షలో ఓ ప్రశ్న "మీ ప్రాంతంలో ప్రముఖ నాటక రచయిత ఎవరు? ఆయన నాటక రంగానికి చేసిన సేవ ఏమిటి?" అప్పటికి నా రచనా వ్యాసంగం ఏడెనిమిది సంవత్సరాలుగా సాగుతోంది. ఎంతో కొంతపేరూ వచ్చింది కనక తేలికగా నేను నా గురించే రాసుకున్నాను. పరీక్ష అయాక శాంథోమ్ బస్సుస్టాండు దగ్గర బస్సు కోసం నిలబడ్డాను. వర్షం తగ్గింది. మరొకాయన నాలాగే పరీక్ష రాసిన వ్యక్తి నిలబడ్డాడు. మాటల్లో ఆయన తెలుగువాడని తేలింది. పరీక్ష గురించి యిద్దరం మాట్లాడుకున్నాం. ప్రముఖ నాటక రచయిత ఎవరిని పేర్కొన్నారని అడిగాను. ఆయన "గొల్లపూడి మారుతిరావు గురించి రాశాను" అన్నాడు. అప్పుడు నన్ను నేను పరిచయం చేసుకున్నాను. ఇద్దరం నవ్వుకున్నాం.

ఆ వ్యక్తి కొంపెల్ల గోపాలకృష్ణమూర్తి. చాలామందికి గుర్తు రావాలంటే శంకరాభరణంలో 'బ్రోచే వారెవరురా' వెర్రిగా పాఠం చెప్పిన మేష్టారు. మేమిద్దరం ఉద్యోగానికి ఎన్నికయాం. ఇద్దరం కలిసి చాలా సంవత్సరాలు హైదరాబాదు

రేడియోలో పనిచేశాం. ఇద్దరం కలిసి తెలుగు మేష్టారు, శిష్యుడు సంభాషణల్ని రేడియో చేశాం. బహుశా ఆ అనుభవమే విశ్వనాథ్‌గారిని శంకరాభరణంలో మేష్టారి వేషానికి ప్రోత్సహించి ఉంటుంది. చిన్న వెలుగులాగ వెలిగి అర్ధాంతరంగా ఆరిపోయిన తెలివయిన దీపం గోపాలకృష్ణమూర్తి.

మా ఆవిడ పుట్టింటికి వెళ్ళాక మా గదిలోకి వచ్చి చేరిన వ్యక్తి తిరుమల రామచంద్రగారు. ఆయన భారతిలో ఉన్న రోజుల్లోనే నా రచన (పేరు గుర్తులేదు) ఒకటి ప్రచురించారు. రోజూ కలిసి పలహారం, ఆఫీసుకి నడక, పక్కపక్కనే కుర్చీలూ – ఆఫీసులోనూ కులాసా కబుర్లూ మా మధ్య సాగేవి. ప్రతి దినమూ. తరువాత పుస్తకరూపంలో వచ్చిన వారి స్వీయ కథ 'హంపీ నుంచి హరప్పాదాకా' అనుభవాలు చాలా మట్టుకు వారి ముఖతః అప్పుడే విన్నాను. ఇంగ్లీషు వార్తల్ని తెలుగులో రాయడం ఇద్దరి పని. మధ్య మధ్య చాలా తీరిక ఉండేది. ఇద్దరం పద్యాల్లో పలకరించుకునేవాళ్ళం. వాటికి కవిత్వ స్థాయి లేకపోయినా, సరసతకి ఏం లోపం లేదు. జ్ఞాపకం ఉన్న కొన్ని

వడయు బోండాయు కాఫీయు వరుసగాను

విందు గుడిచిన వారలే విబుధ వర్య! అని నా ప్రశ్న.

వడ యొక్కటె యున్నది ఆ

వడయును కుడువంగ బోవ చల చల్ల నయెన్

వడి వడి నమిలితినంతే

చెడిపోయి తినయ్య నేను చెలికాడ, భువిన్!

జనపాల బాల వెంకటరెడ్డి అని మరో ఉపసంపాదకుడు. బొత్తిగా మేదకుడు. ఇద్దరం ఆయన మీద శతకాన్ని ప్రారంభించాం. మకుటం అద్భుతంగా తిరుమల రామచంద్రగారే సిద్ధం చేశారు.

సుజన జనపాల 'జనపాల' సుగుణ లోల (రెడ్డి ప్రభువు అనే ధోరణిలో)

సబ్ ఎడిటర్లు సాధారణంగా ఒక 'టాపిక్' మీద వచ్చే వార్తల్ని వారే రాసుకుంటూ పోతారు. ఆ విషయం పూర్వాపరాలు వారికి తెలిసి ఉంటాయి కనుక. ఆ విధంగా కాంగో నేపాలు వార్తల్ని రెడ్డి రాసేవాడు. ఇప్పుడీ పద్యం చూడండి:

గుండు అయ్యరు సతి యిచ్చు గుమ్మపాలు

వినుము కాంగోయు, నేపాలు నీదు పాలు

ఇన్ని 'పాలు'లు గల నీకు విన్నపాలు

సుజన జనపాల జనపాల సుగుణలోల

(గుండు అయ్యరు మా ఆఫీసు కాంటీను యజమాని, రెడ్డి ఎప్పుడూ పాలే సేవించాడు)

చిత్తూరులో ఓసారి టిక్కెట్టు పెట్టి ఏదో నాటికని ప్రదర్శించాం. రామచంద్రగారిని ఓ టిక్కెట్టు తీసుకోమన్నాను. ఆయన డబ్బు యివ్వలేదు – ఒక పద్యం ఇచ్చారు.

మారుతిరావూ నాటక

మూరికె చూపించవయ్య పూరందరికీ

వేరే టిక్కెట్లెందుకు

భారీ చందాలనె సముపార్జించితివే!

మరో ముసలాయన అరవయ్యో పడిలో ఉన్న హనుమంతరావుగారనే సబ్ ఎడిటర్ క్రీడావార్తలు రాసేవారు. ఆయన పత్రికారంగానికి పాత కాపు. వృద్ధులయినా సీనియారిటీ కారణంగా ఉద్యోగం ఇచ్చారు. మనిషి అతి నెమ్మది. ఏ ప్రశ్నకయినా చక్కని చిరునవ్వే సమాధానం. మాట్లాడితే 'అరవ తెలుగు' వాసన తెలిసేది. తెల్లటి మీసాన్ని చక్కగా చెక్కి, వేళ్ళు ఆ మీసం మీద ఎక్కడ జారిపోతుందోనన్నట్టు దానిమీదే ఉంచి కూర్చునేవారు. ఆ మీసం మీద ఓ కంద పద్యం:

మీసమును చూసినంతనె

మోసములో పడుచు వనిత మోహించునయా

వేసములెన్నయినా నీ

మీసమునకు ఆటిరావు హనుమత్ రాయా!

అదొక సరదా. ఏమయినా రామచంద్రగారితో సాహచర్యం చక్కటి సాహితీ పరమయిన సాంగత్యం. తరువాత ఆయన ప్రభనుంచి రాజానామా చేసి వెళ్ళిపోయారు. సంవత్సరాల తర్వాత బెంగుళూరులో జరిగిన ప్రపంచ మహాసభలలో 1990 జనవరిలో రామచంద్రగారిని ఒకే ఒక్కసారి చూశాను. వెంటనే ఆయన్ని గుర్తుపట్టలేకపోయాను. నన్ను చూసి నవ్వారు.

మనిషి చాలా వడిలిపోయారు. వృద్ధాప్యం ముఖాన్ని ముడతలు పడిన ఉలిపిరి కాగితంలాగా చేసేసింది. తీరా గుర్తుకు వచ్చేసరికి నన్ను దాటి వెళ్ళిపోయారు. తర్వాత మరెన్నడూ కలుసుకోవడం జరగలేదు. ఆ మధ్య వారి ఆత్మ కథ 'హంపీ నుంచి హరప్పాదాకా' చదివాను. ఈ మధ్య వచ్చిన ఆత్మకథల్లో తలమానికంగా నిలువదగిన రచన అది. అనుభవానికి అపూర్వమయిన సాహితీ గాంభీర్యాన్ని జోడించి ఆత్మకథని "ఆత్మీయమయిన కథ"గా మలిచారు రామచంద్రగారు.

చిత్తూరు ఆర్ట్స్ కాలేజీ మేమక్కడ ఉండగానే ప్రారంభమయింది. కాలేజీలో ఒక సభకి కలెక్టరు బి.కెరావుగారు అధ్యక్షులు. నేను 'నాటక ప్రయోగం' గురించి మాట్లాడాను. గుంటూరు శేషేంద్ర శర్మగారు (మునిసిపల్ కమీషనర్‌గా ఉండేవారు) మరేదో సాహితీపరమయిన విషయం మీద మాట్లాడారు. అది మా యిద్దరి స్నేహానికి ప్రారంభం.

మా ఆవిడ పుట్టింటికి వెళ్ళాక గంటలు, రోజులూ, రాత్రులూ సాహితి చర్చలతో, కబుర్లతో శేషేంద్ర శర్మగారింట్లో గడిచిపోయేవి. ఎన్నో రాత్రులు అక్కడే భోజనం చేసి అక్కడే నిద్రపోయేవాడిని. నాది సామాజికులని అలరించే రచనా ప్రక్రియ అయితే శర్మగారిది మేధావుల్ని ఆలోచింపజేసే లోతయిన దృష్టీ, ప్రక్రియాను. హెచ్.జి వెల్స్ The Outline Of World History, క్రీడాభిరామం వంటి గ్రంథాల ప్రసక్తి, పరిచయం, పఠనం – ఆ దశల్లోనే జరిగాయి. శర్మగారు 'అందమయిన' పండితులు. అద్భుతంగా పద్యం చదివేవారు. మాట్లాడుతూంటే ఆయన్ని చూస్తూ కూర్చోవాలనిపించేది. సున్నిత హృదయులు. టస్కనీ పాలరాయి పోతపోసినట్టు శరీర ఛాయ. బెంగాలీల్లాగా మీదకి దువ్విన జుత్తు, సన్నని మిల్లు పంచె కడితే సినీ నటుడిని మరిపించేవారు.

ఒకసారి genetics గురించి చర్చ. మనిషి అభివృద్ధికీ, ప్రతిభకీ పరిసర వాతావరణం పుట్టుక వారసత్త్వ ప్రభావం ఎక్కువంటారు ఆయన. ఇద్దరం చర్చలో పడ్డాం. కళవల్ల, సంగీతం వల్ల లేదా తపస్సు వల్ల, సాధన వల్ల చేరడానికి ప్రయత్నించే లక్ష్యం ఒకటేననీ వాటన్నిటిద్వారా సాధించదలిచే అంతిమ గమ్యం ఒకటేననీ – వాటన్నిటిద్వారా సాధించదలిచే అంతిమ గమ్యం ఒకటేనని యివన్నీ ఆ గమ్యానికి వేరు వేరు మార్గాలనీ తేల్చాం. ఈ రోజుల్లోనే ఇద్దరం చర్చలు జరిపి కన్యాశుల్కం మీద వ్యాసాన్ని వ్రాశాం.

శాస్త్రీయ పరిశోధన చేసిన ఐన్‌స్టీన్‌కీ, రాముడిని మనసారా కీర్తించిన త్యాగరాజుకీ, డేవిడ్‌ని రాయిలోంచి వెలికి తీసిన మైకెలాంజిలోకీ గమ్యం ఒకటే – ఏ శాస్త్రమయినా ఒక దశలో కావ్యమయి, పోను పోను ఫిలాసఫీగా మారుతుంది. జిజ్ఞాసి యొక్క అంతిమ స్థాయి ఋషిత్వం.

శర్మగారి స్నేహంలో రెండు కష్టాలున్నాయని డైరీలో రాసుకున్నాను. 1) గంటలు గడిచిపోతాయి. కాలం తెలీదు. 2) ఆయనతో పాటు సిగరెట్లు కాల్చాలి. ఆయన అనుభవిస్తూ కాలుస్తారు. నేను అనుబంధంగా కాలుస్తాను. అంతే తేడా.

గుమంటూరు శేషేంద్ర శర్మగారి ప్రమేయంతోనే విశ్వనాధ సత్యనారాయణగారు చిత్తూరు వచ్చారు. జిల్లా పరిషత్తు హైస్కూలులో వారికి సన్మానం. అంతకుముందే ఎక్కడో విశ్వనాధ వారి కిన్నెరసాని పాటల్ని పిప్పరమెంట్ల పాకం అని పేర్కొన్నారట ఆరుద్ర. అది మనస్సులో ఉన్నట్టుంది సభలో అగ్గిబుగ్గయిపోయారు విశ్వనాధ.

సభలో నేనూ, మల్లాది రామచంద్రశాస్త్రిగారు, శర్మగారూ, మల్లాది వసుంధరగారూ అంతా ఉన్నాం. శేషేంద్రశర్మగారికి అంతకు ముందే నా మొదటి నవల 'చీకటిలో చీలికలు' కాపీ యిచ్చాను. మధ్యాహ్నం ఆ నవల విశ్వనాధవారి కంటబడి ఉంటుంది. మొదటి పేజీలు తిప్పినట్టున్నారు. ప్రసంగం ఉన్నట్టుండి నా నవలమీదికి తిరిగింది. నవల పేరు. రచయిత ఎవరో గుర్తులేదాయనకి. "ఇందాకే ఒక నవల చూశాను. ఆకాశంలోని నక్షత్రాలు మరో ప్రపంచంలోకి తూలిపోయేటట్టున్నాయి – అని రాస్తాడు రచయిత. అప్పుడే పెళ్ళయిన భర్త భార్యను చీకటి రాత్రిలో మంచం వేసుకుని కూర్చోబెట్టుకుని అదిగో ఆకాశంలోని నక్షత్రాలు మరో ప్రపంచంలోకి తూలిపోతున్నాయంటాడా? ఈ వాక్యంలో సహజత్వం ఎక్కడైనా ఉందా? నిజ జీవితానికి సంబంధం లేకపోవడమంటే యిదే" లాంటి మాటలన్నారు.

శర్మగారికీ, మా అందరికీ ఏ నవలని ఉద్దేశించి వారంటున్నారో అర్ధమయిపోయింది. నాకూ అర్ధమయింది. అందరూ యిబ్బందిగా నన్ను చూశారు. నేనూ నవ్వుకున్నాను. ఒక్క క్షణం నా నవల ప్రసక్తి విమర్శగానయినా సభలో విశ్వనాధవారి ముఖతః వచ్చినందుకు ఆనందమే కలిగింది. సభ అయిపోయింది.

విశ్వనాధవారు శర్మగారింట్లో మకాం చేశారు. మర్నాటి మధ్యాహ్నం వారింట్లో భోజనాలు ఏర్పాటు చేశారు. నగరంలో ఉన్న చాలామంది ప్రముఖులను ఆహ్వానించారు. భోజనానంతరం ముందురోజు ఉపన్యాసం టేపు పెట్టారు. ప్రసంగాన్ని అందరం వింటున్నాం. రాత్రి బహుశా నా నవలని విమర్శించినట్టు విశ్వనాధ వారితో అని ఉంటారు. నేను విశ్వనాధవారి పక్కనే ఉన్నాను. నా నవల ప్రసక్తి దగ్గరకి వస్తున్న కొద్దీ అందరి ముఖాల్లోనూ ఆతృత తెలిసింది. మరోసారి మారుతిరావు 'తెలిసి' ఇబ్బందిలో పడబోతున్నాడని. ఆ వాక్యాలు రానే వచ్చాయి. విశ్వనాధవారు నవ్వుతూ నా వేపు చూసి "నేను మిమ్మల్ని తిట్టానా?" అన్నారు.

నేను నవ్వి "మీ విమర్శని సంపాదించుకున్న నవలగా దీన్ని నేను గుర్తుంచుకుంటాను" లాంటి మాటేదో అన్నాను మనస్ఫూర్తిగానే. అది నా మొదటి నవల. ఆయన కవిసామ్రాట్టు. పెద్దల తిట్టు ఆశీర్వాదమే. నా మాటకి ఆయన చలించిపోయారు. ఆద్యంతమూ కరిగిపోయారు. "నిండు మనంబు నవ్య నవనీత సమానము. పల్కు దారుణాఖండల శస్త్ర

తుల్యము" అన్న మాట తు.చ తప్పకుండా వారికి వర్తిస్తుంది. ఉదాహరణ ఆనాటి తర్వాతి సంఘటనే. ఆ సాయంకాలం శ్రీరామ విలాస సభలో ఆర్.బి.రామకృష్ణంరాజుగారు వారికి సన్మానం ఏర్పాటు చేశారు. సభకి ముందుగా విశ్వనాథవారు బయలుదేరి బజారులో శాలవలు కొన్నారు. ఓ కుఱ్ఱాడిని విమర్శించిన పశ్చాత్తాపానికి ప్రతిక్రియ ఏది? ఆ సాయంకాలం సభలో పేరు పేరునా యువ రచయితలందరినీ పిలిచి స్వయంగా శాలువలు కప్పారు. మధురాంతకం రాజారాం, రాజేంద్ర వల్లంపాటి, నేనూ అందరం ఆ ఆశీర్వాదాన్ని అందుకున్నాం. నేను రావడానికి సందేహిస్తుంటే ఆయనే ఎదురొచ్చి "పెళ్ళయి పిల్లల్ని కన్నవాళ్ళకి సిగ్గెందుకండీ" అంటూ శాలువా కప్పారు.

ఆ మర్నాడు కూడా ఉన్నారు. రాత్రి 11గంటలవరకూ వారు చెప్పే మాటలు వింటూ శర్మగారింట్లో గడిపాం. నారాయణరావు అనే ప్రముఖ సంగీత గాయకుని గురించి చెప్తూ ఆయన కథని "మ్రోయు తుమ్మెద"గా ఎలా రచించారో వివరించారు. నా జీవితంలో అదొక్క సందర్భమే విశ్వనాథవారితో అంత దీర్ఘంగా గడిపింది.

పెద్దలు, మిత్రులు డాక్టర్ ఈశ్వర మార్తాండ శాస్త్రిగారు ఆంధ్రా యూనివర్శిటీ మెడికల్ ఆఫీసరుగా పదవీ విరమణ చేయడం ఆంధ్రాలో పెద్ద సంచలనం. క్రమశిక్షణకీ, కర్కశమైన నియమాలకీ అలవాటు పడి, తమకి అలవాటు చేసిన విద్యార్థి లోకం ఒక అర్థం లేని కారణానికి ఆయన్ని నిలబెట్టడం ఆయనకీ, ఆయన్ని తెలిసిన మాలాంటి వారికి పెద్ద షాక్. నిజానికి మాకే కాదు, ఆ షాక్‌ని ఆనాటి ఒక ప్రముఖ దినపత్రిక ఎడిటోరియల్ రాసి మరీ నిరసించింది.

స్థూలంగా జరిగిన విషయం ఇది. ఎవరో కుఱ్ఱాడు హాస్టలులో జబ్బు పడ్డాడు. అతను హాస్టలులో ఉంటున్న కుఱ్ఱాడు కాదు. అతిథిగా ఉండడానికి వచ్చినవాడు. కుఱ్ఱాడిని ఆసుపత్రిలో చేర్చినట్టు శాస్త్రిగారికి ఉదయం నడకకి వెళ్ళినప్పుడు కబురందింది. విషయం అర్థమయి ఆయన తీరా ఆసుపత్రికి వచ్చేసరికి అతని పరిస్థితి విషమించింది. దరిమిలాను కన్నుమూశాడు.

కుఱ్ఱాళ్ళను నిలదీసి, బెదిరించే వ్యక్తిత్వంగల శాస్త్రిగారి మీద ఒక విద్యార్థి వర్గం కత్తిగట్టింది. ఆయన్ని ఉద్యోగంలోంచి బర్తరఫ్ చేయాలని ధర్నాలు చేసింది, అల్లర్లు చేసింది. దశాబ్దాల పాటు సింహంలాగ బ్రతికి, తన కర్తవ్యాన్ని కఠోర దీక్షలాగ నెరపిన శాస్త్రిగారికి ఇది కృతఘ్నత అనిపించింది. మనసు వెయ్యి ముక్కలయింది. ఆయనే పదవికి రాజీనామా చేసి బయటకి వచ్చేశారు.

ఈ విషయం చిత్తూరులోనే తెలిసి షాక్ అయాను. విశాఖపట్న వస్తూనే మహారాణి పేటలో యూనివర్శిటీ లేడీస్ హాస్టలు సమీపంలో ఉన్న వారింటికి వెళ్ళాను. ఆ కష్టంలో ఆయన్ని పలకరించడానికి వచ్చినందుకు ఆయన పొంగిపోయారు. "మిమ్మల్ని చూశాక మనస్సు కాస్త ఉపశమన పడింది" అన్నారు. ఈ సంగతి విని జర్మనీ నుంచి ఒక

జర్మన్ మిత్రుడు రాసిన ఉత్తరం చూపించారు. శాస్త్రిగారికి జరిగిన అన్యాయానికి చింతిస్తూ ఆయన ఓ వాక్యం రాశారు. "డియర్ మార్టిన్ మరిచిపోవద్దు. 1960 సంవత్సరాల క్రితం ఒక వ్యక్తిని ఈ మానవ సమాజం యిలాంటి చెయ్యని నేరానికే శిలువని ఎక్కించింది. అప్పటినుంచీ మానవ స్వభావంలో యింకా మార్పు రాలేదని యిప్పుడు అర్ధమవుతోంది."

శాస్త్రిగారు ఆ తర్వాతనే దైవ చింతన, వేదాంతంలో పడ్డారు. గెడ్డం పెంచారు. ఒకసారి విజయవాడ వచ్చి నా చిన్న ఇంటిలో నా అతిథిగా ఉన్నారు . చాలా గొప్ప పదవిలో ఉండే ఆయన కొడుకు గొప్ప సర్జన్. అకాల మృత్యువుకి లోనయారు. నా రేడియో నాటికలు, రచనలూ చదివి తరుచుగా ఉత్తరాలు రాసేవారు. మా తమ్ముడి పెళ్ళిలో నన్ను చూడటానికి వచ్చారు. నేను జరదా కిళ్ళీకి బానిసనయ్యానని విని మేడ మెట్ల మీద దాదాపు గంటసేపు కూర్చోపెట్టి చెప్పిన మాటల్లో ఒకే ఒక వాక్యం గుర్తుంది. "మారుతిరావుగారూ భగవంతుడిచ్చిన ఈ నోటి ద్వారా రెండే పనులు జరగాలి. పరిశుభ్రమైన ఆహారం లోనికి వెళ్ళాలి. ఆరోగ్యకరమైన మాట బయటకి రావాలి" అని. లోనికి వెళ్ళే పరిశుభ్రత శరీరానికి ఆరోగ్యం, బయటికి వచ్చే 'ఆరోగ్యం' మనస్సు పరిశుభ్రతకి నిదర్శనం. ఈ మాట ఎన్ని వందల మందికి చెప్పానో లెక్కలేదు. ఈ హితవు నాకు శాస్త్రిగారి స్మృతికిచిహ్నం. ఎప్పుడో నా రేడియో నాటిక విని (కళ్యాణి) ఆనందంగా పోస్టు కార్డు రాశారు. గుంటూరు నుంచి. చాలా వృద్ధాప్యంలో నిద్రలోనే శాస్త్రిగారు కన్నుమూశారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments